


# కూరల పేరంటం

తెల్లవారుజామునే కలకలం.

వాకిట్లో ఆరుబయట మంచాలమీద పడుకున్నాం. అందరం ఆ సందడికి నిద్రలేచాం. వాకిట్లో బండి ఆగింది. అందులోంచి మా తాతయ్యగారు, చిన్నబాబాయి దిగారు.

తాతయ్యగారు గాభరాగాలేచి "బావగారూ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకి, రండి రండి" అంటూ వియ్యంకుడిని ఆహ్వానించారు.

"చెన్నపట్నం వెళ్ళాను. వస్తూ పిల్లలను చూసిపోదామని బాపట్లలో దిగి ఇటు వచ్చాం" అన్నారు తాతయ్య.

మా బాబాయ్ మెద్రాసులో చదువుకుంటాడు. ఏడాదికోసారైనా తాతయ్య వెళ్తారు అక్కడికి. చెన్నపట్నం వెళ్ళారంటే మాకు కొండంత సంబరం. వస్తూ ఎన్నో పట్టుకొస్తారు. బొమ్మలు, రంగురిబ్బన్లు, తినుబండారాలు ఒకటేమిటి?

ఈసారి వస్తూ నాకోసం పెద్ద రబ్బరుబొమ్మ, అన్నయ్యకికీ ఇచ్చే కారూ తెచ్చారు. అవికాక బుట్టెడు ఇంగ్లీషు కూరలు పట్టుకొచ్చారు.

కాఫీలు అయ్యాయి. రెండేళ్ళపిల్లంత ఉన్న రబ్బరుబొమ్మను చంకనేసుకుని ఆడుకుంటూ ఉంటే అమ్మమ్మ పిలిచింది.

"మీ తాతయ్యగారు ఇంగిలీషు కూరలు తెచ్చారు. నువ్వెళ్ళి మనకు తెలిసిన నలుగురిళ్ళకీ చెప్పిరా. వచ్చి చూసిపోతారు. లేకపోతే ఆనక తెలిస్తే నిష్ఠూరాలు ఆడతారు" అంది.

వెంటనే స్నానంచేసి పట్టులంగా వేసుకుని వంకీలూ అవీ పెట్టుకొని తయారైపోయాను.

"ఎన్నింటికి రమ్మని చెప్పను? కుంకుంభరిణె తీసికెళ్ళనా?" అని అడిగాను.

"ఏమిటి హడావుడి? ఎక్కడికీ ప్రయాణం?" అంది అమ్మ.

విషయం చెప్పాను.

"ఏమిటే ఇదంతా? వేసవికాలం కూరలు దొరకవని మావయ్యగారు కూరలు పట్టుకొస్తే ఇంత హడావుడి చెయ్యాలా?" అంది అమ్మ.

"చెయ్యక! రాకరాక ఇంగిలీషు కూరలొస్తే గుట్టుగా కూరొండుకు తినేస్తామా? వెనక కుంభకోణం. ఇడ్లీపాత్ర తెప్పించుకుని చూపించలేదనే నిష్ఠూరాలాడేరు. ఏమ్మా మాకు చూపిస్తే ఎత్తుకుపోతామా?" అన్నారు. "నీకేం తెలీదు నువ్వూరుకో" అని అమ్మను కసిరేసి "కుంకుంభరిణె అక్కర్లేదులే వూరికే చెప్పిరా. నాలుగ్గంటలకి రమ్మను" అని నాకు చెప్పింది.

వెంటనే బయలుదేరాను. పేరంటం అనగానే ఓ వరుసక్రమంలో పిలిచేయడం అలవాటు. వెంకటప్పయ్య తాతయ్యగారిల్లూ, బుల్లెయ్యగారిల్లూ, శాస్తుర్లుగారిల్లూ ఇలా వరసన వెళ్ళి చెప్పేశాను.

"అమ్మో! ఇంగిలీషు కూరలే. వస్తాం వస్తాం" అన్నారు అందరూ.

ఇంటికొచ్చి కూరలన్నీ ఒక తడి గోనెపట్టా మీద పరిచి ఇంకో తడి గోనెపట్టా కప్పి మధ్యలో నీళ్ళు జల్లుతూ అమ్మమ్మకి సాయం చేశాను.

అరుగుమీదకి నీడరాగానే కూరలన్నీ వరసన పేర్చాం. "ఇదిగో నువ్వూ, మీ అమ్మా అందుబాటులో ఉండండి. ఈ కూరల పేర్లవీ నాకు నోరు తిరిగి ఏడవవు" అంది ముందు జాగర్తగా.

సరిగ్గా టైముకే మనుషులరాక మొదలైంది. చక్కగా తలలు దువ్వుకుని జరీ చీరెలు కట్టుకుని వచ్చారు. అరుగుమీదున్న కూరలన్నీ చూశారు. "వీటి పేర్లు చెప్పు బంగారం" అంది అమ్మమ్మ.

"ఇదిగో ఇది కేబేజి, ఇది కాలీఫ్లవరు, పక్కన కేరట్టు, దానిపక్కన బీట్‌రూటు" అని చెప్పేశాను గడగడ.

"ఓయమ్మో! ఇన్ని రకాల ఇంగిలీషు కూరలున్నాయా? నాకు తెలీదుస్మీ. నేనింకా ఒక్క రామ్ములక్కాయలే ఉంటాయనుకున్నాను" అంది తాతమ్మ ఆశ్చర్యంగా.

"నిజవేఁ. ఆ ఇంగిలీషువాడి తెలివి తెల్లవారా. మనకు తెలీకుండా ఎన్నికూరలు పండించాడో చూడు" అంది మరో ఆవిడ.

"ఆ మొదటిది ఏవిటన్నావూ?" అడిగింది తాతమ్మ.

"కేబేజీ"

"ఆహాఁ! దాన్ని పునిస్త్రీలు కొయ్యచ్చా. లేకపోతే మన బూడిద గుమ్మడికాయలా పురుషులూ, పూర్వ సువాసినులూ మాత్రమే కొయ్యాలా?" మరో సందేహం.

"అదేంలేదు పిన్నీ. ఎవరైనా కొయ్యచ్చు" అమ్మ సమాధానం.

"నిజమేలే. ఈ ఆచారాలన్నీ మనకే. ఆ ఎంగిలిమంగలం వెధవలకి ఆచారాలు కూడానా?"

"అదేమిటా పక్కది?"

"కాలీఫ్లవరు-అంటే కాలీ పువ్వు."

"అర్థం అయిందిలే. మన అరిటిపువ్వులా అన్నమాట."

"ఆఁ మన అరిటిపువ్వుకి ఈ అందం ఎక్కడిది? పొట్టనిండా దాంగలూ అదీను. ఇదిచూడు-ఎంత నాజూగ్గా ఉందో. ఆ మొగ్గలన్నీ విడదీసి ఇంత మరువం ఇన్ని కనకాంబరాలూ వేసి దండకట్టి తల్లో పెట్టుకున్నా బావుంటుంది." అని మురిసిపోయింది ఒక ముతైదు.

కేరెట్టు చూసి అందరూ ముచ్చట పడిపోయారు.

"ఆ రంగుచూడు. అటు పండిన దొండపండుకి తక్కువగా తరిగిన కందకు ఎక్కువగా కళకళ్ళాడిపోతోంది. ఆ రంగుకు ఆకుపచ్చ కొండలంచు ఉన్న పట్టుచీరె కట్టుకుంటే ఎంత బావుంటుంది" అంది జయమ్మ మామ్మ.

బీట్‌రూట్ మాత్రం ఎవరికీ నచ్చలేదు. ఛీ. శాఖాహారంలా లేనేలేదు. ఇదేం పీడాకారం అనుకున్నారు.

"నువ్వు లక్ష చెప్పు. ఆ తెల్లవెధవలు ఉత్తి అవకతవక వెధవలు. లేకపోతే లక్షణంగా నోరు తిరిగే పేర్లు కాకరకాయ, బెండకాయ, బీరకాయ అని పెట్టుకోక ఇట్లాంటి పిచ్చి పేర్లేమిటంట? పదిసార్లు విన్నా అంతుపట్టడం లేదు" అంది తాతమ్మ.

"నిజమే పిన్నీ. పాపం ఆ దొరల ఇల్లాళ్ళు ఈ నోరుతిరగని కూరలు ఎట్లా కొనుక్కుంటున్నారో, ఎట్లా వండుకు తింటున్నారో?" అంది శ్రీలక్ష్మత్తయ్య.

"నిజమే పాపం. మన అదృష్టంకొద్దీ పెద్దలంతా ఏకమై వాళ్ళను వెళ్ళగొట్టి స్వతంత్రం తెచ్చారు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇంకా విజృంభించి అన్నీ ఇంగిలీషు కూరలే పండిస్తే అన్యాయం అయిపోయేవాళ్ళం" అంది తాతమ్మ.

"కాదూ మరి. మన పిచ్చిమొద్దు వెంకటమ్మ మన కూరలపేర్లే నోరు తిరగక వెంకాయా భెండకాయా అంటుంది. ఇంగిలీషు కూరలమ్మమంటే గుడ్లు తేలేసేది" అంది అత్తమ్మ.

"మీ ఇంగిలీషు కూరలు భేషుగ్గా ఉన్నాయి. మరీ తింటే పైత్యమో చైత్యమో చేస్తుందేమో జాగర్త. ఎందుకైనా మంచిది ఆచారిని పిలిపించి కాస్త మందు దగ్గరుంచుకుని మరీ తినండి" అని చెప్పి వెళ్ళిపోయారందరూ.

* * *